# అప్పుల ఊబిలో పాకిస్తాన్

**ఐ.ఎం.ఎఫ్.,** ప్రపంచబ్యాంకు వంటి సామ్రాజ్యవాద ద్రవ్యసంస్థలు అభివృద్ధిచెందుతున్న దేశాల పరిరక్షకులుగా పోజుకొడుతున్నాయి. వాస్తవానికి అవి సామ్రాజ్యవాద దోపిడీకి, ఆధిపత్యానికి సాధనాలుగా వున్నాయి. ఆయా దేశాలను తమ అప్పుల ఊబిలో ముంచెయ్య టానికి అవి ప్రణాళికాబద్ధంగా పనిచేస్తున్నాయి. ఇండియా, పాకిస్తాన్ వంటి దేశాలు ఇందులో భాగంగానే సామ్రాజ్యవాద ఆర్థిక విధానాలకు అధీనమై వాటికి కట్టివేయబడ్డాయి. దేశాలు తమ సహజ వనరులను, మానవ వనరులను, ఆర్థిక వనరులను తమకు అప్పులిచ్చిన సామ్రాజ్యవాద దేశాలు దోచుకుపోవటానికి వీలుగా అనుసరిస్తున్న విధానాలవల్ల ఈ అప్పుల భారం మరింతగా పెరిగి ఒక విషవలయంలా మారి ఆయా దేశాలు నిరంతరం ఒక సంక్షోభం నుండి మరింత సంక్షోభంలోకి నెట్టబడుతూ, అప్పులిచ్చిన దేశాలకు అణకువగా వుండవలసిన పరిస్థితి ఏర్పడుతున్నది.

జూన్ 22, 2019న పాకిస్తాన్ ప్రభుత్వం సీనియర్ ట్రేడ్ యూనియన్ నాయకుడు, పాకిస్తాన్ కార్మిక సంఘాల డిఫెన్సు క్యాంపెయిన్ ప్రధాన కార్యదర్శి అయిన ఖమర్ ఉజ్ జమన్‌ఖాన్‌ను సెంట్రల్ పాకిస్తాన్‌లోని సాదికాబాద్‌లో అరెస్టు చేసింది. కారణం – పాకిస్తాన్ ఫెడరల్ పార్లమెంటులో బడ్జెట్‌పై చర్చ జరుగుతున్న సమయంలో అతను ఆ బడ్జెట్‌కు వ్యతిరేకంగా ఒక ప్రదర్శన ఏర్పాటు చేశాడు. పాకిస్తాన్ పాలకులు సామ్రాజ్యవాదులకు అనుకూలురుగా వుంటారని బడ్జెట్ తయారీ అంతా ఐ.ఎం.ఎఫ్ కనుసన్నలలోనే జరుగుతుందని పాకిస్తాన్ ప్రజానీకం బలంగా విశ్వసిస్తారు. పాకిస్తాన్ ప్రభుత్వం ప్రజల నిరసనను నిర్బంధాన్ని తీవ్రతరం చేసి అణచివేసింది. జమన్‌ఖాన్ అరెస్టు అందులో ఒక భాగం మాత్రమే. అతనిని ఎక్కడుంచారు ఏమిటన్నది గోప్యంగా వుంచారు. ఇది పాకిస్తాన్ తీవ్ర నిరసనలకు, సోషల్ మీడియా ప్రచారానికి కారణమైంది. కార్యకర్తలు, కార్మికులు పోలీసు స్టేషన్లముందు సమీకృతమై తమ నాయకుడి వివరాలు వెల్లడించాలని డిమాండు చేశారు. చివరకు పోలీసులు అతను తమ కస్టడీలోనే వున్నాడని ఒప్పుకోవలసి వచ్చింది. కానీ అతనిని వారు విడిచిపెట్టకుండా శాంతిభద్రతల సమస్య సృష్టిస్తున్నాడనే సాకుతో కేసు పెట్టారు.

మరోవైపు పాకిస్తాన్ ఫెడరల్ ప్రభుత్వం 2020 బడ్జెట్‌ను ఆమోదించింది. 3సంవత్సరాలలో ఆరు బిలియన్ల అమెరికా డాలర్లను అప్పుగా ఇవ్వటానికి ఐ.ఎం.ఎఫ్. కార్యనిర్వాహక బోర్డు అంగీకారాన్ని తెలియ జేసింది. ప్రజల ఆందోళనల, విమర్శలు సహేతుకమైనవేనని ఈ చర్యలు తెలియ జేస్తున్నాయి. పాకిస్తాన్ ఆర్థికవ్యవస్థ సంక్షోభంలో వున్నందున పాకిస్తాన్‌కు సాహసోపేతమైన, కఠినమైన సంస్కరణల ఆవశ్యకత వున్నదని ఐ.ఎం.ఎఫ్ డిప్యూటీ మేనేజింగ్ డైరెక్టరు, వర్కింగ్ ప్రెసిడెంటు అయిన డేవిడ్ లిప్టన్ పేర్కొన్నాడు. పన్ను పరిమితిని పెంచటానికి, పన్నుల ద్వారా వచ్చే ఆదాయాన్ని పెంచుకోవటానికి బహుళ వార్షిక ఆదాయ పెంపు వ్యూహం గురించి పాకిస్తాన్ దృష్టి సారించాలని అతను సూచించాడు. ఇమ్రాన్‌ఖాన్ ప్రభుత్వం లోటుబడ్జెట్‌ను పూరించటానికి పన్నులద్వారా 36 బిలియన్ డాలర్లను సమీకరించాలని, ప్రజాపద్దుల ఖర్చును తగ్గించాలని, మిలటరీ వ్యయాన్ని తగ్గించాలని పేర్కొంది. ఇదంతా కూడా పాకిస్తాన్ పాలకులు ఐ.ఎం.ఎఫ్‌కు కట్టివేయబడి వున్నారని, దాని ఫలితమే ఈ బడ్జెట్ అని స్పష్టంచేస్తోంది. రాబోయే కాలం అంతా పాకిస్తాన్ ప్రజలకు మరింత గడ్డుకాలమే. పన్నుల రూపంలోను, ధరల పెరుగుదల రూపంలోను, ఇతర జీవన వ్యయాల రూపంలోనూ వారు మరిన్ని భారాలను మోయబోతున్నారు. పాకిస్తాన్ మరింతగా సామ్రాజ్యవాద దోపిడీకి, అవమాన కరమైన దాసోహానికి గురికాబోతోంది.

జమన్‌ఖాన్ కార్మికుల నిరసనగళం రాబోయే రోజుల్లో పాకిస్తాన్‌లో జరగబోయే ప్రతిఘటనలను సూచిస్తోంది. సామ్రాజ్యవాదపు దోపిడికి, పాకిస్తాన్ దళారీ పాలకులకు వ్యతిరేకంగా పాకిస్తాన్ ప్రజలు పెద్ద పోరాటాన్నే సాగించాల్సి వుంది.

০০০০